


# మనుషులు

## 'మల్లిక్'

బజార్లోని జనాన్ని చూస్తూ, వాళ్ళని భేదించుకుంటూ నడుస్తున్న గవర్రాజు చటుక్కున ఆగిపోయాడు. మెఱుపులా అతని చేయి తన జేబులో ఉన్న మరో చేతిని పట్టుకుంది. ఆ చెయ్యి పొయ్యూదుకునే కొయ్య గొట్టాం మాదిరి తగిలింది గవర్రాజు చేతికి. చేతి మణికట్టును అరచేతిలో బిగించి చూశాడు గవర్రాజు. వాడికి పద్నాలుగు ఏళ్ళుంటాయి. బక్కపలచగా, నల్లగా ఉన్నాడు. జుట్టు కొబ్బరిపీచులా ఉంది. కళ్ళు భయం భయంగా గవర్రాజు వంక చూస్తున్నాయి.

"దొంగ వెధవా... జేబులు కొడ్తావా" అని వాడి గూబ పగలగొడ్దామని అనుకున్న గవర్రాజు ఏమీ చెయ్యకుండా వాడి వైపు చూస్తూ ఉండిపోయాడు అప్పటికే నలుగురైదుగురు వాళ్ళిద్దరి చుట్టూ మూగేరు.

"ఏమైంది?... ఏమైం" దని అడిగారు.

పిల్లవాడి కళ్లల్లో నీళ్లు తిరిగాయి గవర్రాజుకు జాలి కలిగింది

"జేబు దొంగతనం చేశావా?... తన్నండి వెధవని! దొంగముఖం వాడూను!!.." అన్నారెవరో.

జనం ఇంకా మూగిపోతున్నారు- బెల్లం మీది ఈగల్లా. వాడిని కొట్టొచ్చిన ఇద్దరు ముగ్గుర్ని ఆపాడు గవర్రాజు.

"నాతో రా" అన్నాడు ఆ అబ్బాయితో.

"సార్..!నన్ను పోలీసులకి అప్ప జెప్పకండి సార్" దీనంగా వేడుకున్నాడు.

"పోలీసుల దగ్గరికి ఎందుకు సార్.. మనమే నాలుగు తంతే సరిపోతుంది. మళ్లీ ఎప్పుడూ దొంగతనం చెయ్యడు" అన్నాడు వడ్డీ వ్యాపారి సేఠ్ ధనీరామ్. అవునని కొందరూ కాదని కొందరూ అన్నారు.

ఆ అబ్బాయి చెక్కిళ్లమీదుగా కన్నీళ్లు కారడం మొదలయింది.

"ఏం ఫరవాలేదు. నిన్ను పోలీసులకు అప్పజెప్పను... నాతో రా" అన్నాడు గవర్రాజు. వాడు ఆశ్చర్యపోయాడు. గవర్రాజు అడుగులు ముందుకు వేశాడు. చుట్టూ మూగిన జనం నోళ్లు తెరుచుకుని చూస్తూ గవర్రాజుకు దారి ఇచ్చారు. గవర్రాజు ఆ అబ్బాయితో ఇంటికి బయలుదేరాడు.

అక్కడ చేరిన జనానికి గవర్రాజు ప్రవర్తన ఏమీ అర్థం కాలేదు

"నీ పేరేమిటి?"

"నరసిమ్మ..." బెదురుతూ గవర్రాజుకు సమాధానం ఇచ్చాడు.

"ఎక్కడుంటావు?"

"మసీదుకాడ!" నరసిమ్మ గుండెల్లో బితుకు బితుకు మంటుంది. యింటికి తీసుకెళ్లి తీరికగా తంతాడేమోనని భయం వేసింది. ఇంకా ఏమేమి అడుగుతాడో... ఈ విషయాలన్నీ పోలీసులకు చెప్తాడేమోనని భయం వేసింది. కాని గవర్రాజు ఇంక ఏమీ అడగలేదు.

గవర్రాజు మౌనంగా నడుస్తున్నాడు. అతని చెయ్యి మాత్రం గట్టిగా నరసిమ్మ చేతిని పట్టుకొని ఉంది. నరసిమ్మ మధ్య మధ్య భయంగా గవర్రాజు ముఖంలోకి చూస్తున్నాడు. ఇంతలో గవర్రాజు ఇల్లు వచ్చేసింది.

తాళం తీసి లోపలికి ప్రవేశించారు ఇద్దరూ. గవర్రాజు వీధి తలుపు గడియ వేశాడు. నరసిమ్మకి ఇంకా మనసులో భయంగానే ఉంది. గదిలో చీకటిగా ఉంది.

లైటు వెలిగింది!... ఉలిక్కి పడ్డాడు నరసిమ్మ. గవర్రాజు దీక్షగా నరసిమ్మ ముఖంలోకి చూస్తూ నిలబడ్డాడు.

"ఇక్కడే ఉండు. బయటికి పోవడానికి ప్రయత్నించావంటే పోలీసులకి



రిపోర్టు యిస్తాను – తెలిసిందా?" అని ప్రక్క గదిలోకి వెళ్లాడు. ఒకటి, రెండు నిముషాల తరువాత చేతిలో రెండు ప్లేట్లతో వచ్చాడు. వాటిలో యాపిల్ పళ్ల ముక్కలు, రెండేసి అరటి పళ్లు, కొన్ని బిస్కట్లు ఉన్నాయి. ఒక ప్లేటు క్రింద కూర్చుని ఉన్న నరసిమ్మ ముందు పెట్టి తినమన్నాడు. వాడి కళ్లు నమ్మలేనట్లు గవర్రాజు వంక చూశాడు.

"ఊ... తిను" కాస్త గట్టిగా అన్నాడు గవర్రాజు.

గబ గబ తినడం మొదలుబెట్టాడు నరసిమ్మ. వాడు యాపిల్ పండు ఎప్పుడూ తిని ఎరగడు. యిప్పుడు వాడి మనసులోని భయం దూది పింజల్లా ఎగిరిపోయింది. గవర్రాజు వాడికేసి పరిశీలనగా చూస్తూ తింటున్నాడు. ఇంత చిన్నతనంలోనే దొంగతనాన్ని జీవనాధారంగా ఎందుకు చేపట్టాడో తెలుసుకోవాలని అనిపించింది గవర్రాజుకు. అందుకనే వాడిని ఇంటికి తీసుకువచ్చాడు.

నరసిమ్మ ముందున్న ప్లేటు ఖాళీ అయింది.

"ఆ మూల కూజా ఉంది... అదిగో... ఆ టేబులు మీద గ్లాసు

ఉంది మంచినీళ్లు త్రాగు" అన్నాడు గవర్రాజు

మంచినీళ్లు త్రాగి మూతిని చొక్కా ఎత్తి తుడుచుకుంటూ నిలబడ్డాడు నరసిమ్మ.

"కూర్చో."

క్రింద చతికిలబడ్డాడు నరసిమ్మ.

గవర్రాజు సోఫాలో కూలబడి రాములు వంకే తదేకంగా చూస్తున్నాడు. అయిదు నిముషాలు మౌనంగా గడిచి పోయాయి.

"నువ్వు జేబుదొంగగా ఎందుకు మారావు?"

హఠాత్తుగా అడిగాడు గవర్రాజు, సూటిగా నరసిమ్మ ముఖంలోకి చూస్తూ.

నరసిమ్మ బిత్తరపోయాడు. అస్పష్టంగా మనసులోనే ఏమేమో గొణుక్కున్నాడు. తల ఎత్తి గవర్రాజు వంక చూశాడు.

"నన్ను పోలీసులకు పట్టియ్యకండి సార్" అన్నాడు దీనంగా.

"నువ్వు నిజం చెప్తే నిన్ను ఏమీ చెయ్యకుండా వదిలేస్తాను.

నరసిమ్మ తల వొంచుకున్నాడు. కాస్సేపటికి తల ఎత్తి చూశాడు. వాడి చెక్కిళ్ల మీదుగా కన్నీరు కారుతుంది,

"మూడురోజులనుండీ తిండి లేదు సార్!"

"అరెరె... పాపం... మీ అయ్య ఏం చేస్తాడు?"

"మాకు నాన్నలేదు సార్ అమ్మ ఉంది ఇద్దరు చెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నారు సార్ అమ్మకు జెర మొచ్చింది. ఈ యాలకు నాలుగు రోజులౌతుంది సార్. మా అందరికీ మూడు రోజుల నుండీ నీళ్లే సార్" అన్నాడు కళ్లు తుడుచుకుంటూ.

గవర్రాజుకు చాల జాలివేసింది. కాని పైకి మాత్రం కనబడనీయలేదు.

"అయితే మాత్రం దొంగతనం చేస్తావా?... ఏదో పనిచేసుకుని గంజి త్రాగి బ్రతకాలి గానీ... ఈ సారికి ఏదో చేశావుగానీ ఇక ముందు దొంగ తనం చేయకు... సరేనా?" అన్నాడు.

"ఇంకెప్పుడూ చేయనండీ!"

దొంగతనం పాపం!... ఇంకెప్పుడూ పరులని దోచుకోవద్దు అని చెప్దామను కున్న గవర్రాజు వీపుమీద ఎవరో చెర్నాకోలతో కొట్టినట్లయి మాట్లాకుండా ఊరుకున్నాడు.

గవర్రాజు జేబులోంచి పది రూపాయలనోటు తీసి నరసిమ్మ దగ్గరికి వచ్చాడు.

"ఇదిగో... ఇది పట్టుకెళ్లి బియ్యం కొని యింట్లో ఇవ్వు" అన్నాడు.

నరసిమ్మ సందేహించాడు.

"పరవాలేదు... తీసుకో" అంటూ నరసిమ్మ చేతిలో నోటు కుక్కాడు.

నరసిమ్మ ముఖం మతాబులా వెలిగి పోయింది.

'ఇంకెప్పుడూ దొంగతనం చెయ్యవు కదూ ?''

తల అడ్డంగా ఊపాడు నరసిమ్మ

"సరే తర్వాగా బియ్యం కొని యింటికి పట్టుకెళ్లు"

నరసిమ్మ గవర్రాజుకు నమస్కారం చేసి తలుపు తీసుకుని వీధిలోకి తూనీగలా వెళ్లిపోయాడు

గవర్రాజు తలుపు వేసుకొని సోఫాలో కూలబడిపోయాడు. అతని మనసునిండా ఆలోచనలే.

నరసిమ్మ దొంగతనం చెయ్యడంలో తప్పేమీలేదు. మూడు రోజులనుండీ వాళ్లింట్లో ఎవ్వరికీ తిండిలేదు. కాయ కష్టం చేసి సంపాదించుదామంటే వాడింకా చిన్నవాడు వాళ్లమ్మ జ్వరాన పడింది. కడుపు మాడుతుంటే ఇంక అంతకన్నా ఏం చెయ్యగలడు. నరసిమ్మ దొంగ తనం చెయ్యబోయాడంటే అర్థం ఉంది. ఒంటరివాడు...తనకి...తనకి ఇంకా డబ్బు ఎందుకు ?... ఎవరికోసం ?... ఏమి చేద్దామని ?... తనకు ఇంకా డబ్బు సంపాదన అనవసరం !!

గవర్రాజు జేబులోంచి నోట్ల కట్ట బయటకు తీశాడు. అదంతా నరసిమ్మకు ఇచ్చినా అతనికి నష్టంలేదు... కానీ ఇవ్వలేదు... కేవలం పదిరూపాయలు మాత్రమే ఇచ్చాడు.

ఆలోచిస్తున్నకొలదీ గవర్రాజు బుర్ర బొంగరంలా గిర్రున తిరగసాగింది. అందుకనే అనుకుంటాడు అలా ఆలోచించకూడదని. గవర్రాజు ఇది వరలో చాలాసార్లు అనుకున్నాడు. కాని తెల్లవారేసరికి అంతా మర్చి పోతాడు

ఏమైనా సరే రేపటినుండి తను మారిపోవాలనీ, అక్రమ సంపాదన తనకు అనవసరమనీ అనుకున్నాడు గవర్రాజు.

మర్నాడు ప్రొద్దున్న ఆఫీసుకు బయలుదేరాడు గవర్రాజు. మనిషి ఆఫీసుకు అరమైలు దూరంలో ఉన్నా మనసు మాత్రం ఆఫీసులోనే ఉంది.

ఆ రోజు అఫీసుకు పిచ్చయ్య వస్తానన్నాడు. అతని పని ఒకటి గవర్రాజు ద్వారా జరగవలసి ఉంది. తన పని చేసిపెడితే అయిదు వేలిస్తానన్నాడు. ఆ రోజే తెచ్చి యిస్తానన్నాడు. ఈ రోజుల్లో మడికట్టు కుని కూర్చుంటే లాభంలేదు...వాడికి డబ్బు బాగా ఉంది. తను చేసిపెట్టే పనివల్ల లాభం బాగా వస్తుంది. తనకు కొంత యిస్తానన్నాడు. అంతే !... అసలు అన్యాయం లేని దెక్కడా ఈ రోజుల్లో అని ఆలోచిస్తూ ఆఫీసు వైపుకు నడుస్తున్నాడు గవర్రాజు.

గవర్రాజును అంతదూరంలో చూసిన నరసిమ్మ, స్నేహితులతో అప్పటిదాకా తను క్రితం రోజు చూసిన రెండవ ఆట సినిమా కథ చెప్పడం ఆపి

"అదుగోరా.. నే చెప్పలే అతనే ఆ వెర్రిబాగులోడు'' అంటూ గవర్రాజుని చూపించాడు.